**చిన్నప్పుడు బమ్మెర వెళ్తే.. కనీసం పది రోజులైనా ఉండకుండా ఎప్పుడూ తిరిగి వచ్చేవాళ్లం కాదు. ఆ సమయమంతా రకరకాల ఆటలు, పాటలు, ముచ్చట్లు, నవ్వులు అంతులేకుండా సాగేవి. తినేటప్పుడు, నిద్రపోయేటప్పుడు తప్ప.. గుంపుగా మా కజిన్స్ అందరం రోజంతా ఒకేచోట ఉండేవాళ్లం.**

# సాయెబు వైద్యం - 1

## బూబమ్మ తాయెత్తు!

బయటున్న పెద్ద ఆవరణలో ఓ పక్కన బొడ్రాయి, మరో పక్కన గడీ మైసమ్మ.. రాళ్ల రూపంలో ఉండి పసుపు, కుంకుమ అద్దిన గ్రామ దేవతల కొలువులు ఉండేవి. అయితే, ఏవో పండుగలప్పుడు తప్ప.. ఇంట్లో పూజగదిలో దేవుళ్లకు చేసినట్టుగా అక్కడ రోజూ పూజలు ఏవీ చేసేవారు కాదు. 'వాటి దగ్గరగా వెళ్లొద్దు!' అనే హెచ్చరికలు ఉండటం వల్ల మేము ఆ వైపుగా వెళ్లేవాళ్లం కాదు.

ఆవరణ మధ్యలో ఓ పెద్ద వేపచెట్టు, దాని చుట్టూ రాతితో కట్టిన గుండ్రటి అరుగు ఉండేది. అక్కడ ఎప్పుడూ ఊరివాళ్లు కొందరు కూర్చుని మాట్లాడుకుంటుండేవారు. అప్పుడప్పుడూ గడీలోకి ఒకాయన వచ్చేవాడు. తెల్లటి జుట్టు, పొడవాటి గడ్డంతో, భుజాన ఓ సంచీ.. మోకాళ్ల కింది దాకా పొడవైన జుబ్బా వేసుకునేవాడు. ఎప్పుడూ ఆ వేపచెట్టు కింద ఉన్న అరుగు మీద కూర్చునే వాడు. ఆయన రాగానే లోపల ఎక్కడో ఆడుకుంటున్న మాకు తెలిసేది. ''సాయెబు ఒచ్చిండటసాయెబు ఒచ్చిండట.. పోదాం రాండి'' అని ఆగమాగంగా పరిగెత్తుకొచ్చేవాళ్లం.

''సాయెబు తాతా! నాకు ఇక్కడ మొన్న దెబ్బ తాకింది. చూసి మందు పెట్టండి'' అని ఒకరూ.. ''నాకు చేతి మీద కురుపు అయింది. చూడండి!'' అని ఇంకొకరూ.. ''నాకు మొన్న ఆడుతుంటే మోచేతి దగ్గర గీరుకపోయింది. కొంచెం మందు పెడ్తరా!'' అని మరొకరూ.. అంటూ ఆయన చుట్టూ మూగేవారు. మా పెద్దవాళ్లు ఎవరినైనా కొత్తవాళ్లను 'మీరు!' అనాలని చెప్పేవాళ్లు. సాయెబు తాత అందర్నీ చిరునవ్వుతో పలకరించేవాడు. ఆ తెల్లగడ్డం చాటున మెత్తగా నవ్వుతూ ఉండేవాడు. సంచీలోంచి ఏవో డబ్బీలు, సీసాలు, రంగురంగుల పక్షి ఈకలు బయటికి తీసేవాడు. ''ఉండు బిడ్డా! మలాము రాస్త!'' అంటూ ఒక్కోదెబ్బకు ఒక్కోసీసాలోని మందులో ఈకను ముంచి.. గాయం మీద రాసేవాడు. నిజంగానే రెండు రోజుల్లో నొప్పి తగ్గిపోయేది. దానికంటే ముందు చల్లగా ఉండే ఆ మందు చేతి మీదో, కాలిమీదో ఉంచి.. పక్షి ఈకతో మృదువుగా రాస్తుంటే ఎంతో హాయిగా బాగుండేది. ఆ ఈకలు ఎన్నో రంగుల్లో అందంగా ఉండేవి. అలాంటప్పుడు ఆ దెబ్బ తగిలినవాళ్లు ఎంత అదృష్టవంతులో అనిపించేది.

ఒకసారి ఇలాగే సాయెబు తాత రాగానే మా అక్కచెల్లెళ్లు అందరూ పరిగెత్తుతున్నారు. నాకేమో అప్పటికి రెండు మూడు సార్లయినా ఈక చికిత్స దక్కలేదు. అసలు ఎప్పుడూ కింద పడలేదు, నొప్పి లేదు. ఏముందని అడగాలి? ఇవతల మా కజిన్స్ ఏమో.. ''సాయెబు తాత మందుపెడితే ఎంత జల్ది తక్వయితదో ఎరికేనా?! ఎంత బాగుంటదో తెల్సా?!'' అని చెబుతుంటే.. 'అయ్యో! నేను ఉత్తగనే పక్కకు నిలబడి చూడవలసిందేనా?!' అని ఆరేళ్ల వయసున్న నాకు అనిపించడంలో అన్యాయం ఏమైనా ఉందా?!

'ఇక లాభంలేదు! ఏదో ఒకటి చేయాలి!' అనుకుని అక్కడే నిలబడ్డాను. సడన్‌గా ఓ ఐడియా వచ్చింది. అక్కడే ఓ గరుకు గోడ ఉంది. వెంటనే ఒక్కక్షణం కళ్లు మూసుకుని.. మోచేయి కిందిభాగం ఆ గోడకేసి గట్టిగా రుద్దాను. మొత్తం గీరుకుపోయి చిన్నగా రక్తం వచ్చింది. ఒకటే మంట.. ఆ చుట్టూ ఎర్రగా అయింది. 'ఎందుకొచ్చిన అవస్థ!' అనిపించింది. కానీ, ఇక మెల్లగా చేయి ఊదుకుంటూ వెళ్లాను.

అప్పటికి అందరూ ఏదో ఒక మందును సాధించారు. ఐడియాలు, గాయాలు లేని మిగతా వాళ్లు చుట్టూ నిలబడ్డారు. నన్ను చూడగానే సాయెబు తాత పిలిచి పక్కన కూచోబెట్టుకున్నాడు. నా చేయి చూపించాను. ''అరె! ఇప్పుడే తగిలిందా బేటా!'' అని చిన్నగా నవ్వాడు. నాకెందుకో అంత చిన్న వయసులోనూ ఆయనకు నా సంగతేదో తెలిసి నవ్వినట్టు అనిపించింది. సాయెబు తాత ఒక మలాము తీసి ఈకతో మృదువుగా రాస్తుంటే.. నొప్పి అప్పుడే తగ్గిపోయినట్టు అనిపించింది. ఆయన ఒక డబ్బీలో కొంతమందు తీసిచ్చి.. సంచీలో చేయిపెట్టి నీలి, ఆకుపచ్చ రంగులున్న ఒక ఈకను నాకిచ్చి.. ''రెండు రోజులు పొద్దూ, మాపూ అమ్మతో రాయించుకో బిడ్డా! తక్వయితది!'' అన్నాడు. నేను అవి తీసుకుని.. 'చూశారా?! ఎంత అందమైన ఈకను సంపాదించానో?!' అన్నట్టు మా కజిన్స్ వైపు చూశాను. ''ఇప్పటిదాక మంచిగనే ఉంటివి. గట్లెట్ల గోడ గీరుకున్నదే?!'' అని వాళ్లు అడిగితే, అతికష్టం మీద ఓ గంట మాత్రమే నిజం దాచగలిగాను.

మా ఊర్లో నాన్నకు మూడు పోస్టులు ఉండేవి. పట్వారీ, పోలీస్ పటేల్, మాలీ పటేల్. చాలా ఏళ్లపాటు అవి వంశపారంపర్యంగా ఉండేవనుకుంటా. అయితే నాన్న ఒక పట్వారీ పనిమాత్రం చేసి.. మిగతావి వేరేవాళ్లకు ఇచ్చేశాడు. అలా మా ఇంటికి అఫ్జల్ మియా అనే ఆయన పోలీస్ పటేల్‌గా అప్పుడప్పుడూ వస్తుండేవాడు.

అఫ్జల్‌మియా వేసే దిష్టిమంత్రం.. ఆయన ద్వారా పరిచయమైన బూబమ్మ.. ఆమె కట్టే తాయెత్తు గురించి వచ్చేవారం చెప్పుకొందాం! ■





నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి